సాధువాక్యం

తిరుక్కురళ్



స్వామి సుందర చైతన్యానంద

సాధు వాక్యం

తిరుక్కురళ్



జ్ఞానబ్రహ్మ, ఆర్షవిద్యా వాచస్పతి

స్వామి సుందర చైతన్యానంద

స్వర్ణోత్సవ కెరటాలు - II

294.53
చైత - సాధు

సాధువాక్యం

10309
Cal 23/3/5

స్వామి సుందర చైతన్యానంద

ప్రథమ కెరటం .... 1997 .... 2000 ప్రతులు

(సర్వస్వామ్యములుట్రస్టువి)

ప్రతులకు :
సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్
సుందర చైతన్య ఆశ్రమం
ధవళేశ్వరం : 533 125
☎ : 77378

వెల: రూ. 10/-

ముద్రణ : ☎ : 31575
శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్,
కొవ్వూరు - 534 350

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No. 24624
గచ్చిబౌలి, హైదరాబాద్-500032



జ్ఞానబ్రహ్మ

పూజ్యశ్రీ స్వామి సుందర చైతన్యానంద



ఇలా - అలా

ఇలా ఉంది అనేదాని నుండి 'అలా ఉండాలి' అనేదాని వైపు పరుగులు తీయడానికే సృష్ట్యాది నుండి మానవాళి అలవాటు పడింది.

ఉన్నది ఇలా ఎందుకున్నదో గ్రహించే శక్తి మానవునికి లోపించడం వలన, లేనిదానిని ఆశించి పరుగులెత్తడం జరుగుతోంది. తన ప్రయత్నం ద్వారా గాని, అన్యుల సహకారంతో గాని, లేదా ఊహించని పరిణామాల వల్ల గాని 'ఇలా' ఉన్నది 'అలా' మారుతుందేమో అనే ఆశ.

ఒకనాడు 'అలా' అని ఊహించిందే నేడు 'ఇలా' గా తెలుస్తున్నది అనే సత్యం అర్థం కానివానికి రేపు 'అలా' గా మిగిలేది కూడా నేడు 'ఇలా' గా తెలిసిందే అనే వాస్తవం ఎలా అవగత మవుతుంది?

'ఇలా' ఉన్న దానిని మార్చడం కాకుండా, దానితో మనుగడ సాగించడం సత్యజీవనము. అదియే జీవన కళ.

'ఇలా' ఉన్నది మరోలా 'అలా' కాలేదు. దానిని మనిషి అర్థం చేసుకోవాలి. H_2O నీరుగా ఉంటుంది. నింగిలో ఊరేగినా, నేలపై పారినా అది నీరే. అది మరోలా ఉండలేదు. ఇది జీవనసత్యం. మార్పు చేసేందుకు వీలులేనిది. మేలుకానిది. ఇలాంటి విషయాలలో అవగాహనతో కలిసి జీవించడం మనిషికి అర్థం కావాలి.

అర్థం కానపుడు ఏది తెలిసినా అది వ్యర్థమే అవుతుంది. కనుకనే తాను నివసిస్తున్న ప్రపంచం మనిషికి వ్యర్థంగా స్ఫురిస్తోంది. కారణం, తాను వ్యర్థంగా మిగిలి ఉండుటయే.

వ్యర్థజీవికి ప్రపంచమంతా వ్యర్థంగా కనిపిస్తుంది. సమర్థత చేకూరితే అంతా పరమార్థంగా తెలిసి వస్తుంది.

'వ్యర్థం' అనే దానికి అర్థమేమిటి? వ్యర్థము అనే దానిని మనిషి చూస్తున్నాడా? లేక, 'వ్యర్థము, అనే భావనను కలిగియున్నాడా? చూస్తూ ఉన్నట్లయితే అది సత్యమే అవుతుంది. సత్యమైనది వ్యర్థమెలా అవుతుంది? ఒకవేళ, భావమే అయితే అది ఉన్నదానితో విభేదిస్తున్నదని అర్థం. ఈ విభేదము 'ఇలా' ఉన్నదానినుండి 'అలా'

ఉండాలి అనుకున్న దానివైపు పరుగులు తీస్తుంది. కనుక మనిషి పరుగు లెత్తేది భావాలలోనే గాని వాస్తవాలలో కాదు. తన ఆంతరంగిక ప్రవృత్తిలోనే గాని బాహ్య ప్రపంచంలో కాదు. ఈ రెంటికి మధ్య తేడా అర్థం కానంతవరకు బ్రతుకు కుదుటపడదు. మనసుకు కునుకు పట్టదు.

బాహ్యంలో అనిశ్చిత పరిస్థితి ఉంది. అనివార్య పరిణామం సాగుతోంది. గందరగోళం గూడు కట్టుకొని ఈ ప్రపంచంలో జీవిస్తోంది. వ్యాధులు పీడిస్తున్నాయి. ఇవన్నీ అనివార్యములని అర్థమైతే, వ్యాధులు ఉంటాయి; కాని వ్యధలు ఉండవు.

మృత్యువు వస్తుందని బాధపడుతూ ఉంటాము. ఇది భావం. మృత్యువు అనేది వచ్చి యున్నదే గాని రాబోయేది కాదు. జన్మతోనే మృత్యువు కూడా కలిసి వచ్చింది. కలిసి జీవిస్తున్నది. కనుకనే ఏనాడైనా కబళించ గలుగుతుంది. ఇవి 'ఇలా' అర్థమైతే, 'అలా' ఉండాలి అనిగాని, ఉండకూడదు అని గాని అనిపించదు. అనిపించని నాడు భావాలు లేవు అని అర్థం. భావాలు కలత పెట్టని నాడు సత్యాలు శోభిస్తూ ఉంటాయి.

మానవ స్వభావం లోని ఈ నిగూఢ భావ మెలికలను క్షుణ్ణంగా పరిశీలించి, మానవుని మనుగడ ఈ ప్రపంచంలో అర్థవంతంగా, సమర్థవంతంగా సాగేందుకు రాజమార్గమును నిర్మించిన ఎందరో మహానుభావులలో పదిహేను వందల సంవత్సరాల క్రితం తమిళదేశంలో తళుక్కుమనిన తపోరత్నము శ్రీ తిరు వళ్ళువర్

తిరు వళ్ళువర్ గొప్ప తపస్వి. తపోహృదయంతో ఆనాటి సామాజిక వ్యవస్థను కాచి వడపోసిన గొప్ప మనస్వి. తాను దర్శించిన సత్యాలను సమాజ శ్రేయస్సునకు ఉపయోగించి సర్వులచే ఆరాధించబడిన యశస్వి.

ఆయన రచించిన తిరుక్కురళ్ అనే పద్య కవిత తమిళ సమాజాన్ని బాగా కుదిపివేసింది. గుండె గుండెను తట్టి మరీ పలకరించింది. ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహను కదిలించింది. ధార్మిక జీవనమును ఆవిష్కరించింది. వైద్యుడు రోగిని పరిశీలించి చికిత్స చేయునట్లు, తిరు వళ్ళువర్ ఒక గొప్ప బిషగ్వరుడై సామాజిక రుగ్మతలను దూరంగా తరిమాడు. మానవత్వము, సహకార జీవనము, ధర్మాచరణము, నైతిక శిక్షణము, కర్మ సిద్ధాంతము, ఈశ్వరత్వము - ఈ విషయాల

చుట్టూ వారి బోధ విచ్చలవిడిగ చరించింది. జాతికి, నీతికి పట్టిన చెదలను దులిపింది.

అయస్కాంతము ఇనుప ముక్కను ఆకర్షించినట్లు తిరు వళ్ళువర్ బోధలు మేధావుల్ని ఆకట్టుకున్నాయి. ఆనాటి మేధావుల్నే గాక ఆధునికంగా మహాత్ములు, మాననీయులు అనిపించుకున్న గాంధీజీ, వినోబాజీ, రాజాజీ వంటి ప్రజ్ఞావంతుల్ని కూడా తిరుక్కురళ్ గ్రంథం విశేషంగా ఆకర్షించింది.

ఆత్మజ్ఞానమును పొందుటకు అంతఃకరణశుద్ధి ప్రధానమైనది అనే సత్యాన్ని తిరు వళ్ళువర్ గుర్తించారు. అందుచేత, వారి బోధలన్నీ ఎక్కువగా ధార్మిక పంథాలోనే సాగాయి. బుద్ధుడు, కన్ఫ్యూషస్, జినుడు లాంటి మహాత్ముల బోధలతో వీరి బోధలకు సామ్యం కన్పిస్తుంది. ఆ కారణం చేతనే వీరిని జైన మతస్థుడని కొందరు అర్థరహిత నిర్ణయం కూడా చేశారు.

రాజ్య పరిపాలనము, ధర్మము అనేవి వేరు కాకూడదని వీరి ప్రగాఢ విశ్వాసము. వ్యక్తిజీవనము, మతము అభేదంగా సాగాలని ఆయన నిశ్చితాభిప్రాయము. అందుచేత వారి బోధలు రాజీ పడకుండా నడిచాయి. మచ్చుకు కొన్ని పుచ్చుకొని చూద్దాం.

- ధర్మజీవనము ద్వారా లభించే సుఖమే నిజమైన సుఖము. అన్య సుఖములన్నీ దుఃఖ కారణాలు; అగౌరవ హేతువులు.
- అతిథికి పెట్టిన తరువాత ఆరగించే అలవాటు కలవాడే భూమిలో విత్తనాలు చల్లుటకు అర్హుడు. ★
- ఒక వ్యక్తి తన జీవితంలో అనేక తాత్త్విక సిద్ధాంతాలను జీర్ణించుకోవచ్చు. సందేహాలను తొలగించుకొని ఉండవచ్చు. కానీ, సదాచార జీవనమే చివరగ సమున్నతమై శోభిస్తుంది. కనుక ఎన్ని కష్టాలెదురైనా సదాచారమును విస్మరించకూడదు.
- చెడు నుండి చెడు పుడుతుంది. అగ్ని ఎలా దహింపచేస్తూ విస్తరిస్తుందో అలాగే చెడు వ్యాపిస్తుంది. కనుక మానవులు చెడును అగ్నికన్నా భయంకరంగా భావించి స్పృశించడం మానేయాలి.

★ 'దున్నేవాడిదే భూమి' అనే సిద్ధాంతానికి, దీనికి తారతమ్యాన్ని గుర్తించాలి.

ప్రతి మనిషి అలలా 'అలా' దొర్లిపోకుండా "ఇలా" ఇలలో నిలబడేలా తిరు వళ్ళువర్ చేసిన ధర్మబోధ ఆర్షసంస్కృతీ కిరీటంలో ఒక మణిపూసలా శోభిస్తోంది.

నిద్రపుచ్చే చీకటిలా ఎందరైనా చిలుకపలుకులు పలకగలరు. తట్టి లేపే వెలుగులా బోధల్ని అందించేవారే మహాత్ములు. ఈ మహిలో చరించిన దేవతా స్వరూపాలు.

అద్దం లేనిదే మన ముఖం మనకు కనిపించదు. జ్ఞానము లేనిదే మనలోని సత్యం మనకు అవగతం కాదు. ఈ జ్ఞాన దీపాలు పుణ్య భారతావనిలో ఎన్నడూ ఆరవు. వాటి వెలుగులు నిత్య కాంతులు. అవి పురాతనాలు. చిరంతనాలు. నిరంతరం నింగిలో శోభించే విజ్ఞాన తారామండలాలు.

'వాణి' పాతదే అయినా క్రొత్త 'బాణి'ని సమకూర్చుకొని దేశకాలాదుల పరివర్తనము పరిశీలిస్తూ బోధలను పంచడం ఈ సంస్కృతిలో అనూచానంగా వస్తున్న ఆచారం. సదాచారం. సత్సంప్రదాయ సారం.

ఈ మార్గంలో మనకు లభించినదే 'తిరుక్కురళ్' గ్రంథం. ఇది తమిళంలో పద్యకవిత. ఏ భాష ఇంపు ఆ భాషదే. అయినా భాషలలో స్ఫురించే సొంపు వేరే భాషలలోకి రమ్మన్నా రాదు. తమిళంలో తిరు వళ్ళువర్ రచించిన గ్రంథం ఆంగ్లానికి తర్జుమా కాగా, ఆంగ్లము నుండి నేను ఆంధ్రానువాదం చేశాను.

వస్తుసౌందర్యంలో ఔచిత్యం లోపిస్తుందనే విషయంలో మరో భావానికి అవకాశం లేదు. కాని వస్తుగుణం దెబ్బ తినలేదని మాత్రం నేను ధైర్యంగా చెప్పగలను.

ఇందులో 'తిరుక్కురళ్' గ్రంథములోని 220 సూక్తులను సేకరించి అందిస్తున్నాను. మీకు ఏవేవి యుక్తమో ఏరుకొని, అవి జీవితంలో తొంగి చూడాలని మనసారా కోరుకొని జీవించండి. ధర్మ జీవన మార్గంలో ఏనాడైనా ఎదురయ్యేది దైవమే.

ప్రణవ ప్రేమలతో.

మీ

స్వామి సుందర చైతన్యానంద

తిరుక్కురళ్

1. ఒక నాటకాన్ని చూచేందుకు తండోపతండాలుగా జనం వచ్చునట్లు మెరుపులాగా ధనం మనిషిని చేరుతుంది. నాటకం సమాప్తం కాగానే జనులందరూ అదృశ్యమౌనట్లు ధనం కూడా కాలంలో అదృశ్యమౌతుంది.

2. కర్మశుద్ధికి సంకల్పశుద్ధి అనేది తాళంచెవి వంటిది. దుష్ట సంకల్పాల నుండి విముక్తి చెందిన మనసును పొందుటయే మతజీవనము యొక్క లక్ష్యము. అయితే ఇది నిశ్శబ్ద ప్రక్రియ. బాహ్య ఆడంబరాలన్నీ శబ్దజాలములే; ప్రదర్శనలు మాత్రమే. (అకులం)

3. "ఆచరించగలిగే శక్తి వచ్చినపుడు ధర్మాన్ని గూర్చి ఆలోచించవచ్చు" అని భావించకు. ధార్మిక జీవితాన్ని ఇప్పుడే ప్రారంభించు. అన్నియు నిరుపయోగములై అదృశ్య మైనపుడు నీకు చెదరని సహాయకారి ధర్మమే సుమా!

4. అధర్మ మార్గాలలో లభించే సుఖము త్వరలోనే దుఃఖముగాను, అవమానకరంగాను గోచరిస్తుంది. కనుక ధర్మాచరణము అనేది కేవలం సదాచారమే కాదు; జ్ఞానమయం కూడా.

5. సహాయం చేయడం ఉత్తమం. కానీ చేసే విధానము కూడా మధురంగా ఉన్నప్పుడు అది గ్రహించేవాని హృదయాన్ని సున్నితంగా స్పృశిస్తుంది. ఇది మనం చేసే సహాయం కన్నా ఉత్కృష్టమైనది.

6. తియ్యని పలుకులు లభించేటప్పుడు కర్కశంగా బాధించే మాటల్ని మానవులు ఎందుకు ఎన్నుకుంటారు? విత్తు లేని పక్వమైన ఫలములు లభించేటప్పుడు వాటిని విస్మరించి అపక్వమైన వాటిని కోయడం బుద్ధిహీనత కాదా?

7. ఇతరులు మనల్ని బాధించినపుడు దానిని భరించడం కష్టమే. అలాంటివి కొన్ని సమయాలలో మృత్యు సదృశంగా ఉంటాయి. కానీ వారే ఒకప్పుడు మనకు చేసిన మంచి విషయాల్ని, సహాయాన్ని స్మృతికి తెచ్చుకోవాలి. ప్రస్తుత బాధను ఆ స్మృతులు నివారిస్తాయి.

8. తనను సుఖపెట్టినట్లే ఇతరులను కూడా సుఖపెట్టే విధంగా సాగే వాణిజ్యమే ధర్మవ్యాపారమని వ్యాపారవేత్తలు గ్రహించాలి.

9. కాలడం వల్ల ఏర్పడిన గాయం మాని మాసిపోతుంది. కాని పరుషవాక్కు కల్గించిన బాధని గాయపడ్డవాడు మరచిపోలేడు. అతని మనసులో అది మాయని మచ్చగా ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

10. జీవించడం కన్నా సదాచారముతో జీవించడం పవిత్రము. నిజానికి సదాచారమే జీవితానికి వన్నె తెచ్చిపెడుతుంది.

11. నమ్మిన వారిని మోసం చేయడమనే పాపపు ఆలోచనలకు లోబడి జీవించడం కన్నా మరణించడమే మనిషికి మేలు చేస్తుంది.

12. తనను కర్కశంగా త్రవ్వేవాడికి భూమాత మేలు చేయడం లేదా! మనకు చెడు చేసిన వారిని కూడా మనం అలా భరించడమే మంచిది.

13. తిరిగి బాధించడం వల్ల లభించే ఆనందము ఆనాటివరకే. భరించి జీవించ గలిగితే ఆ వైభవము జీవితాంతము ఉంటుంది.

14. ఈర్ష్య గలవాడు బాహ్యంలో తనకు ఒక్క శత్రువు లేకపోయినా తన సుఖాన్ని తేలికగా జారవిడుచుకుంటాడు. చెయ్యదగిన మోసాన్నంతా ఈర్ష్య అనే ఒక్క శత్రువు చేసిపెట్టగలదు.

15. ఈర్ష్యల వల్ల ఇప్పటికి ఎవరూ ఏమీ పొందలేదు. ఈర్ష్య పడనివారు ఇంతవరకు పోగొట్టుకున్నది కూడా ఏమీ లేదు.

16. ఇతరుల లోపాలను గుర్తించినట్లు, తమ లోపాలను కూడా మానవులు చూసుకోగలిగితే, ఈ ప్రపంచంలో చెడు సమూలంగా నశిస్తుంది.

17. వర్షాన్నిచ్చే మేఘాలకు జీవరాసులు ఏం మేలు చేశాయి? అలాగే సమాజం నుండి ఏమీ అందకపోయినా నీవు సమాజానికి సేవ చేయాలి.

18. విశాలహృదయుని చేతిలో నిలిచిన విత్తము సమాజ రుగ్మతలను నివారించుటలో వైఫల్యమెరుగని ఔషధంలా పనిచేస్తుంది.

19. జ్ఞానాన్ని పొందేందుకు వివేకము అవసరమని అందరికీ తెలుసు. కానీ మంచిని పెంపొందించుకొనేందుకు దయ అవసరమని ఎందరికి తెలుసు?

20. మాంసము అంటే ఏమిటి? మరొక ప్రాణి దేహంలో నున్న వికారమైన వ్రణం కాదా? ఈ సత్యం గ్రహించిన వాడు మాంసభక్షణం ఎలా చేయగలడు?

21. రహస్యంగా నీవు ఆచరించే లజ్జాకరమైన విషయాలను నీలోనే ఐదుమంది సాక్షులై వీక్షిస్తున్నారు. నేను చెప్పేది సర్వసాక్షియైన భగవంతుణ్ణి గూర్చి కాదు. దేహంలో ఉన్న పంచభూతాలే నవ్వుతూ నిందిస్తున్నాయి.

22. సరియైన అవగాహన లేనినాడు పంచేంద్రియాలు అందించే జ్ఞానమంతా నిష్ప్రయోజనమే అవుతుంది.

23. ఇల్లులేని, ఏమీలేని, ఎవరూలేని పేదవాడు సులభంగా సన్యాసి కావచ్చు. కానీ, కాడు. పైగా పేదరికంతో పోరాడుతూ, ప్రాపంచిక సంగత్వముతో, దుఃఖముతో నిండిపోయి ఉంటాడు. సన్యాసాన్ని పొందుటకు సంబంధించిన పుణ్యాకర్మలను గత జన్మలలో ఆచరింపక పోవడమే దీనికి కారణము.

24. దురదృష్ట మనేది ఒక వరదలా వచ్చి పడుతుంది. కానీ ప్రజ్ఞావంతుని ఒక్క సదాలోచనతో అది అతని మనస్సులో అదృశ్యమౌతుంది. దురదృష్టము ఎదురైనపుడు నవ్వడం నేర్చుకోవాలి. దురదృష్టాన్ని దాటి, విజయానికి చేరువయ్యేందుకు నవ్వు కన్నా మించింది లేదు.

25. గెలుపు నిన్ను వరించినా జూదాన్ని నీవు త్యజించాలి. చేప గాలాన్ని పొందడం లాంటిదే జూదంలో గెలుపు.

26. తలపై ఉన్నప్పుడు కేశములు అందంగా ఉంటాయి. వదలిపెట్టి వెళ్ళాయా మాలిన్యంగా మిగిలిపోతాయి. స్థాయిని వదలి దిగజారిన మానవంతుల పరిస్థితి కూడా అలాగే ఉంటుంది.

27. "తరువాత నువ్వు పశ్చాత్తాపంతో పరితపిస్తావు" అని నీ అంతరాత్మ చెప్పినపుడు ఆ పనిని చేయడం మానేయ్. ఒకవేళ అలాంటి పనినే నీవు చేసియున్నచో, మళ్ళీ అలాంటిపని చేయకుండా జాగ్రత్తపడు.

28. ధనముండినను తాను అనుభవించక, ఇతరులకు ఇవ్వక జీవించువాడు సమాజ శరీరంలో వ్యాధి వంటివాడు.

29. ఇంతవరకు భుజించిన ఆహారము పూర్ణంగా జీర్ణమైనది అని మనం నిర్ధారణ చేసుకున్న తరువాతనే మళ్ళీ భుజించగలిగే అలవాటును ఏర్పరచుకుంటే, దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుకొనేందుకు మరొక మందు అవసరం లేదు.

30. నిషేధింపబడిన వస్తువుకై అఱ్రులు చాచడమే దోషాలన్నిటిలో గొప్పదైన దోషము.

31. పరమాత్మ ప్రసాదంగా మానవులకు లభించిన చిరునవ్వును, చిద్విలాసమును ముఖాన చెడిపివేసే క్రోధము కన్నా మానవాళికి గొప్ప శత్రువు మరొకరున్నారా?

32. సత్యాన్ని దర్శించాలనే కోరిక దృఢంగా ఉంటే ప్రాపంచికమైన కోరికల్ని సులభంగా విడిచిపెట్టవచ్చు.

33. కూతకు, చేతకు పొత్తు కుదరని వారితో స్నేహము కలలో కూడా మంచిది కాదు.

34. బుద్ధిహీనుడు భాగ్యవంతుడైతే పిచ్చివాడు మత్తుపానీయము పుచ్చుకున్నట్లే ఉంటుంది.

35. ఒక పిలుపుకే పలికి పవిత్రాత్ములు సేవ లందిస్తారు. బుద్ధిహీనులు చెఱకుగడ వలె పిండితేనే గాని ఉపయోగపడరు.

36. వ్యయము అదుపులో ఉంటే అల్పాదాయము అనర్థదాయకము కాదు.

37. నవ్వడం చేతకాని వారికి ఈ విశాల ప్రపంచము పగటిపూట కూడా అంధకార బంధురమే.

38. పద్మాలు నీటిమట్టము వరకే పెరుగుతాయి. మనిషి కూడా మనసును దాటి ప్రవర్తించలేడు.

39. పాండిత్య ముండి కూడా పలుకు నేర్వనివారు సౌందర్యము ఉండి సౌరభము లేని పూలవంటివారు.

40. పథకాలు అందరూ రూపొందించగలరు. కాని, అరుదైన వ్యక్తులు కొందరే వాటిని అమలు చేయగలరు.

41. తాను తినక, పరులకు పెట్టక జీవించే ధనికుడు సమాజ శరీరంలో వ్యాధి వంటివాడు. వ్యాధి రక్తప్రవాహాన్ని అడ్డుకున్నట్లు, లోభి ధనప్రవాహాన్ని (చెలామణి) ఆపుతాడు.

42. హింసను, మాంసభక్షణమును వీడిన వారిని సర్వజీవులు పూజిస్తారు.

43. చెవిటివానికి చెవి ఉండి ఎలా ప్రయోజనము లేదో, అంధునికి కళ్ళు ఉండి ఎలా ఉపయోగము కావో సౌకుమార్యము లేనివానికి హృదయము ఉండి కూడా ప్రయోజన ముండదు.

44. బాహ్యశుద్ధికి ఉపకరిస్తుంది జలము. అంతశ్శుద్ధికి సహకరిస్తుంది సత్యము.

45. విలువలేని వాటిని విలువైనవిగా గుర్తించిన దోషమే మానవుని బాధలకు, దుఃఖాలకు కారణము.

46. బుద్ధిహీనులైన మిత్రులను పోగొట్టుకోవడంలో ప్రాప్తించేది లాభమే గాని నష్టము కాదు.

47. తినే వస్తువు కనిపించగనే కావు - కావు మని కాకి తన బంధువుల్ని పిలుస్తుంది. తనకు లభించిన దానిని ఇతరులతో పంచుకొనే గుణం కాకిలో ఉంది. నీవు మనసున్న మానవుడివి. కాకిని చూచి అయినా నేర్చుకో.

48. అందరిని ప్రేమించే సుగుణము గల సత్పురుషుని నుండి మహాపాపాలు కూడా పరుగెత్తుకొని పోతాయి.

49. లోకం గౌరవించే స్థితికి ఎదగడానికి కారణమైన దారిద్ర్యము వాస్తవానికి గొప్ప ఐశ్వర్యమే. కొన్ని పరిస్థితులలో మరణము చిరంజీవత్వములా ఉంటుంది. ఐశ్వర్యము కన్నా శక్తివంతమైన దారిద్ర్యము, అమృతత్వము కన్నా పవిత్రమైన మరణము విలువలు జీర్ణమైన విశిష్ట వ్యక్తులకే లభ్యమవుతాయి.

50. మరణము బాధాకరమైనది. కాని, తాను పతితులకు ఉపకరించలేని స్థితిలో ఉన్న సత్పురుషునకు మరణమే హాయిగా ఉంటుంది.

51. దుష్ట భావాలకు మనసును దూరంగా ఉంచాలి. అదియే ధర్మావగాహన. మిగిలిన దంతయూ శబ్దజాలమే. ప్రదర్శనమే.

52. అధర్మ మార్గంలో లభించిన సుఖము శీఘ్రంగా దుఃఖాన్ని, అవమానాన్ని తెచ్చిపెడుతుంది. సదాచార జీవనము ధర్మయుతమే కాదు, జ్ఞానమయం కూడా.

53. తాను జీవించవలసిన రీతిలో ఏ మానవుడు ఈ ప్రపంచంలో జీవిస్తూ ఉంటాడో అతడు స్వర్గంలోని దేవతలతో సమానుడు.

54. పతిని గౌరవించే సతి ముందు ప్రకృతి కూడా తలవంచుతుంది. ఆమె ఆజ్ఞకు లోబడి మేఘాలు కూడా వర్షిస్తాయి.

55. ధన సంపాదన భోగానుభవానికి, లోభ సంతృప్తికి కాదు. సహకార జీవనానికి ధనం పరికరం కావాలి. అన్యులకు చేసే సహాయములో తన ధర్మముందని గ్రహించాలి.

56. పాత్రపై పెట్టబడిన మూత పాత్రతో ఏకం కాలేదు. ప్రత్యేక వ్యక్తిత్వాలతో అణచబడిన పరస్పర ద్వేషాలతో కలిసి ఉండేవారి వలన సమాజంలో సమానత్వం ఏర్పడదు.

57. ప్రపంచంలో ఎన్ని పరిశ్రమలైనా ఆవిర్భవించనీ. కాని, చివరికి ప్రపంచం ఆధారపడేది వ్యవసాయము మీదనే. కనుక, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరియైన వృత్తి వ్యవసాయమే.

58. ఆతిథ్యాన్ని ఆశించి అరుదెంచిన వారికి ఆనందముతో ఆహ్వానం పలికే వారిని చూచి లక్ష్మీదేవి సంతసించుటయే గాక వారి ఇండ్లలో సంతోషంతో సంచరిస్తుంది.

59. దయ గల పలుకులు అందించేదేమిటో తమ జీవితంలో రుచి చూచి కూడా పరుషవచనాలు పలకడంలో జనుల ఆంతర్య మేమిటో అంతుచిక్కని విషయం.

60. ఇతరులు చేసిన మంచిని మరవడము చాలా చెడ్డ కార్యము. కానీ ఇతరులు నీకు చేసిన కీడును మరచిపోవడం మాత్రము చాలా మంచి కార్యము.

61. దేనినైనా విస్మరించవచ్చు; కానీ నాలుకను జాగ్రత్తగా అదుపులో ఉంచుకోవాలి. ఇది చేతకానివారు బాధల్ని అధిగమించలేరు.

62. మోహలోలుడు మోహాన్ని సులభంగా భావిస్తాడు. ఆ క్షణంతో అంతరిస్తుందని నిర్ణయిస్తాడు. కానీ మోహము వల్ల లభించే సుఖము క్షణకాలమైనా, ప్రాప్తించే దుఃఖము జీవితాంతము వెంబడిస్తుంది.

63. ప్రతీకారము వల్ల లభించే సుఖము ఆ రోజుకే పరిమితం. సహనము వల్ల ప్రాప్తించే ఆనందము జీవితాంతము ఉంటుంది.

64. బాహ్య ప్రపంచంలో అజాతశత్రువుగా పేరు గాంచిన వాని సుఖమును కూడా ఈర్ష్య హరిస్తుంది. జీవితాన్ని మోసపుచ్చడానికి ఈర్ష్య ఒక్కటి చాలు.

65. లోభము వల్ల అపజయము, సంతృప్తి వల్ల విజయము మనిషికి లభిస్తాయి.

66. దుర్జనులు దుష్టకృత్యాలను ఆచరించుటకు కూడా వెనుకాడరు. కానీ, సజ్జనులు దుష్టభావాలు కదలగనే చలించిపోతారు.

67. అవగాహన కలిగి సమాజం పట్ల తన కర్తవ్యాన్ని గుర్తించిన వ్యక్తికి సంపదలు చేరడం వర్షపు నీటితో గ్రామచెరువు నిండడం లాంటిది.

68. దాన మడగడం చిన్నతనంగా నీకు అనిపించవచ్చు. కానీ ఆ భావన ఎంతవరకు ఉంటుందో తెలుసా? నీ ద్వారా జరిగిన సత్కార్యాన్ని వీక్షించనంతవరకే.

69. పోయిన సంపదను తిరిగి సంపాదించవచ్చు. పాడైన సంస్కారమును తిరిగి బాగుచేసుకోవడం చాలా కష్టము.

70. ఇతరుల వలన తనకు కలిగిన దుఃఖమును మనసులో దర్శింపగలవారే తమ వల్ల ఇతరులకు కలిగే దుఃఖమును గూర్చి అర్థం చేసుకోగలరు.

71. ఇతరుల సంపదను చూచి ఈర్ష్యపడడం దారిద్ర్యముతో సమానము. ఈర్ష్య గలవాడు ఎంత ఐశ్వర్యవంతుడైనా దారిద్ర్యము ననుభవించే వానితో సమానముగా దుఃఖమును అనుభవిస్తాడు. ఈ దుఃఖము ధన సంపాదనతో తీరదు. ఇతర భోగములను అనుభవించుట వలన దూరం కాదు. దీనికి కారణము ఏమిటో తెలుసా! దుఃఖ కారణము తనకన్నా వేరుగా ఇతరుల సంపదకి సంబంధించి ఉండుటయే. కనుక ఈర్ష్యను జయించుట ఈ ప్రపంచంలో గొప్ప వరము వంటిది.

72. మనసులో పుట్టే క్రోధమును నిగ్రహించుకొని, ఉద్రేకమును అణచుకో గలిగిన వ్యక్తిని సర్వసుగుణములు ఆవరిస్తాయి. సర్వసుఖాలు చేరుతాయి.

73. తాను భుజించే ముందు అతిథి కొరకు నిరీక్షించే వ్యక్తి యొక్క కార్యాలను నిర్వర్తించేందుకు దేవతలు సిద్ధంగా ఉంటారు. ఆతిధ్యము అనేది భవిష్యత్తులో కార్యఫలము సిద్ధించుటకు బీజమై ఉంటుంది.

74. నాలుగు విషయాలను త్యజించుటయే నిజమైన మత జీవనము. అవి 1. ఈర్ష్య 2. సుఖాభిలాష 3. క్రోధము 4. పరుషవాక్కు.

75. ధర్మ మార్గంలో గృహస్థాశ్రమమున జీవించు వ్యక్తి ప్రయత్నించి పొందదగినది మరొకటి లేదు. అరణ్యాలకు, ఆశ్రమాలకు వెళ్ళి అతడు సాధించవలసింది ఏమీ ఉండదు.

76. ధర్మాచరణలో జాగు చేయడం మంచిది కాదు. దేహము వీడి చనునపుడు మనిషికి తోడుగా నడచేది ధర్మ మొక్కటే. జీవితము చంచలమైనది. ధర్మమును విస్మరించడం బుద్ధిహీనతయే.

77. ధర్మము యొక్క ఫలితమును ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కొందరు పల్లకీ ఎక్కి ఊరేగుచుండగా, కొందరు అదే పల్లకిని మోయుటను వీక్షించిన సరిపోవును.

78. స్వర్గప్రాప్తిని అందించినను దానమును గ్రహించుట అనునది గౌరవప్రదమైనది కాదు. నరకప్రాప్తిని కలిగించేదైనను దానము చేయుట అనునది ప్రశంసనీయమైనదియే.

79. యోగి ఆకలిని జయిస్తాడు. అది అతని గొప్పతనమునకు ప్రతిరూపము. కానీ దానికంటెను గొప్ప కార్యము ఇతరుల ఆకలిని తీర్చుటయే.

80. మృత్యువనేది జీవితములో అతి భయంకరమైనది. కాని సంపన్నుడుగా ఉండి పేదల ఆకలిని తీర్చలేనివాని పట్ల అది ఆహ్వానించ దగినదియై ఉన్నది.

81. సర్వధర్మములను అధ్యయనము చేసిన తరువాత, అన్ని ధర్మములలో సర్వులకు ఉపకరించు ధర్మము ఏది అని ప్రశ్నించినచో అది "శీలము" అని చెప్పవచ్చు. దానిని సంపాదించి రక్షించుకోగలిగితే దానికి మించిన విలువైనది మరొకటి ఉండదు.

82. వేదాలను అభ్యసించిన బ్రాహ్మణుడు వాటిని మరచిపోతే, మళ్ళీ ప్రయత్నించి వాటిని స్మృతికి తెచ్చుకోవచ్చు. కానీ శీలమును పోగొట్టుకున్నవాడు బ్రాహ్మణత్వమునే పోగొట్టుకుంటాడు.

83. అసూయాపరుడు ఎలా ఈ ప్రపంచంలో సంపన్నుడుగా రాణించలేడో శీలమును పోగొట్టుకున్నవాడు సమాజములో గౌరవమును పొందలేడు.

84. సమాజానికి పెద్ద ఎత్తున సమ్మతించదగిన రీతిలో ప్రవర్తించకపోతే, పర్వత ఎత్తున గ్రంథాలను అధ్యయనం చేసినవారు కూడా గొప్పవారు కాలేరు.

85. శీలము, ఔదార్యము - ఈ రెండిటి మీదనే ప్రపంచము యొక్క ప్రగతి ఆధారపడి ఉంది. ఆ రెండు రథానికి రెండు చక్రాల వంటివి. వాటిలో ఏ ఒక్కటి శిథిలమైనా ప్రగతి రథం కూలిపోతుంది.

86. ధర్మ జీవనము ద్వారా లభించే సుఖమే నిజమైన సుఖము. అన్య సుఖములన్నీ దుఃఖ కారణాలు. అగౌరవ హేతువులు.

87. ధర్మప్రేమలతో శోభించినపుడే గృహస్థ జీవనము అందముగను, ఆదర్శవంతముగను ప్రకాశిస్తుంది. ప్రేమ అందాన్ని కల్పిస్తే ధర్మము ఆదర్శాన్ని జోడిస్తుంది.

88. సదాచారవంతుడైన గృహస్థుని ధర్మాచరణములో సహకరించే సుగుణాలు ధర్మపత్నికి లేనిచో అట్టి గృహస్థాశ్రమము సరియైనది కాదనే చెప్పాలి. అర్ధాంగికి ఈ సుగుణము లేనిచో ధనము గాని, మరో విధమైన పరిస్థితులు గాని తృప్తి నివ్వలేవు.

89. ప్రేమించే ప్రతి వస్తువులోను ఆరాధనా భావం స్ఫురించేందుకే వేదాంత తత్త్వము విగ్రహారాధనను ప్రవేశపెట్టింది. పతిభక్తి . దైవభక్తి కన్నా తక్కువైనది కాదు.

90. బుధజనులలో ఒక సముచిత స్థానాన్ని పొందగలిగే విధంగా బిడ్డకు విద్యా గంధమును కలిగించుటయే బిడ్డకు తండ్రి ఇవ్వవలసిన పారంపర్య సంపద.

91. "ఆహా! ఇలాంటి కుమారుని కనిన ఆ తండ్రి పుణ్యము మహోత్కృష్టమై ఉంటుంది" అని అందరూ ఆశ్చర్యంతో పలికేలా జీవించుటయే కుమారుడు తండ్రికి చేయవలసిన నిజమైన సేవ.

92. హృదయ సౌకుమార్యము లేనపుడు జీవితమే నిరర్థకమైనదని అర్థము. ఎడారిలో ఎండిన వృక్షము పచ్చని ఆకులతో శోభిస్తుందా?

93. శారీరకంగా ఆచరించే కర్మల కన్నను ప్రేమలోనే జీవితం ప్రఫుల్లమౌతుంది. హృదయ సౌందర్యము లేనపుడు చర్మముతో కప్పబడిన శల్యముల ప్రోగే కదా ఈ దేహము! జీవిత రహస్యము అంతయు ప్రేమలోనే ఉంది.

94. సన్యసించకుండా మనిషి గృహస్థ జీవనంలో ఎందుకు కొనసాగుతున్నాడో, సంపదలను ఎందుకు కూడగట్టుకొంటున్నాడో తెలుసా! ఆశించిన వారికి సహాయము అందించే విధంగా సంపదలపై తన ఆధిపత్యాన్ని సాధించేందుకు.

95. గృహస్థ జీవన మనునది హక్కు కాదు. బాధ్యత. సమాజానికి సహకరించవలసిన వ్యక్తి ధర్మమును ఆచరించవలసిన బాధ్యత.

96. అతిధికి పెట్టిన తరువాత ఆరగించే అలవాటు కలవాడే భూమిలో విత్తనాలు చల్లుటకు అర్హుడు.

97. "జీవితాంతము శ్రమించి మనం పొందిన లాభమేమిటి? ఇప్పుడేదీ ఉపయోగపడుట లేదు. ఆశ్రయించుకోవడానికి ఏదీ మిగలలేదు;" ఈ విధంగా మరణకాలంలో వ్యథ చెందేవా రెవరో తెలుసా? దానగుణము అలవడక సదా ఇతరుల సహాయం కొరకు నిరీక్షించేవారు.

98. పేదలైన అతిధులను సున్నితమైన పువ్వులలాగా చూడాలి. ఆఘ్రాణించ డానికి ముక్కు దగ్గర పెట్టుకోగానే సున్నిత సుమాల రేకులు ఊడిపోతాయి. ఇంటికొచ్చిన పేద అతిథిపై అసమ్మతి దృక్కును ప్రసరింప చేయగనే అతడు తీవ్రంగా చలించిపోతాడు.

99. జ్ఞాని యొక్క వాక్కు ప్రేమలో తడిసిన సత్యము.

100. నవ్వు రాజిల్లే మోము, ఆహ్వానం పలికే చూపు, ఎదుటి వ్యక్తి భావాలను గౌరవించే సత్యవాక్కు- ఇవే దుఃఖార్తుల శోకాన్ని రూపుమాపుతాయి. ఇవేవీ లేకుండా దుఃఖితులకు చేసే సహాయం బాధలను నివృత్తి చేయలేకపోగా గాయపరుస్తుంది కూడాను.

101. ప్రేమపలుకుల ద్వారా ఇతరుల హృదయాలకు ఆనందాన్ని కలిగించువారు దారిద్ర్యాన్ని చూచి భయపడ నవసరం లేదు. అలాంటివారు బాధపడటాన్ని లోకం సహించదు.

102. కరుణాపూరిత వచనాల యొక్క అద్భుతమైన ప్రభావ మెలాంటిదో మనకు ప్రత్యక్షానుభవంలో గోచరిస్తున్నా, మనం మాట్లాడేటప్పుడు దానిని పూర్తిగ మరచి పరుషవచనాలు పలుకుతూ ఉంటాము.

103. చేసిన సహాయము చాలా స్వల్పమైనదే కావచ్చు. కాని దానిని చేయవలసిన అవసరము యొక్క సమయాన్ని గుర్తించి చేస్తే, ఆ సహాయము యావత్ప్రపంచము కన్నా పెద్దదిగా కనిపిస్తుంది.

104. ఆత్మనిగ్రహ మనునది ముముక్షువునకే గాక గృహస్థునికి కూడా అవసరమైన దివ్య సుగుణము. ఆత్మనిగ్రహము వ్యక్తిని దేవతల మధ్యకు నడిపిస్తుంది. అది లేనివారికి అంధకారమే ప్రాప్తిస్తుంది.

105. ఆత్మనిగ్రహానికి మించిన పవిత్రవృత్తి మరొకటి ఉండదు. ధనాన్ని కనిపెట్టుకొని ఉండునట్లు ఈ సుగుణాన్ని రక్షించుకోవాలి.

106. అనేక అన్యాయాలను మానవులు మరచిపోతారు. కానీ అవమానాన్ని అంత తేలికగా మరచిపోలేరు. కనుక పలుకు విషయంలో అందరూ ఎరుక గలిగి ఉండాలి. ఆ ఒక్క విషయంలో జాగ్రత్త వహించగలిగితే మిగతా విషయాలు వాటంతట అవే సర్దుకుపోతాయి.

107. జీవితము కన్నా జీవిత క్రమశిక్షణే చాలా అమూల్యమైనది. క్రమశిక్షణ వల్లనే జీవితము యొక్క విలువ పెరుగుతుంది.

108. ఒక వ్యక్తి తన జీవితంలో అనేక తాత్త్విక సిద్ధాంతాలను జీర్ణించుకోవచ్చు. అనేక సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. కానీ సదాచార జీవనమే చివరగా సమున్నతమై శోభిస్తుంది. కనుక ఎన్ని కష్టాలెదురైనా సదాచారమును విస్మరించకూడదు.

109. ఇతరులకు సంబంధించిన వాటి విషయంలో కలిగే దుష్ట భావాలను అదుపు చేసుకోగలగడమే మానవత్వము. ఇది చక్కని సంఘజీవనము. మరియు ఉత్కృష్టమైన మతనియమము.

110. ఇతరులు నీకు కీడు చేస్తే సహించు. కాని, నీకు చేతనయితే దానిని మరచిపోవడం ఉత్తమము. కీడు చేసిన వారికి తిరిగి కీడు చేయడం గొప్పగా సాధించదగిన విషయం కాదు. తనకు జరిగిన అన్యాయానికి తిరిగి అన్యాయం చేయకుండా మనగలిగే సహనశీలుడు ప్రజల స్మృతులలో పచ్చగ మిగిలిపోతాడు.

111. అవమానము జరిగిన సమయాన సహనంతో క్షమాగుణమును ప్రదర్శించు గృహస్థుడు సన్యాసి నియమాలను పాటించిన వాడవుతాడు.

112. ఇతరుల సంపదను చూచి ఓర్వలేని వ్యక్తుల విషయంలో లక్ష్మీదేవి అసహనంతో ప్రవర్తిస్తుంది. అటువంటి వారిని ఆమె త్యజించుటయే గాక, వారిని తన జ్యేష్ఠ సోదరియైన దురదృష్టదేవతకు అప్పగిస్తుంది.

113. నిజమైన సుఖాన్ని అభిలషించువారు తగని విషయాల జోలికి పోకూడదు. వాటివల్ల ఒకవేళ ఆనందము కలిగినా, అది క్షణికమేనని మరువరాదు. ధర్మయుతంగా పొందిన వాటి నుండే సత్యానందము సంప్రాప్త మవుతుంది.

114. పదిమంది ఉన్నచోట అర్థరహిత ప్రసంగాలు చేయడం కీడు చేయడం కన్నా ప్రమాదకరమైనది. కాలినప్పటికన్నా తరువాతే గాయాలు ఎక్కువగా బాధపెట్టునట్లు పరుషవాక్కులు అనంతర ఫలితాలను అందిస్తాయి.

115. చెడు నుండి చెడు పుడుతుంది. అగ్ని ఎలా దహింప చేస్తూ విస్తరిస్తుందో అలాగే చెడు వ్యాపిస్తుంది. కనుక మానవులు చెడును అగ్నికన్నా భయంకరంగా భావించి స్పృశించడం మానేయాలి.

116. మనిషి సంఘజీవిగా జన్మించాడు. సహకార జీవనము నెరిగి జీవించిననాడే మానవుడు సంఘజీవి అనిపించుకొంటాడు. ఇది గుర్తించని వాడు మృతునితో సమానుడే. మన చుట్టూ వసించేవారికి మేలు చేయుటలో కలిగే ఆనందము ఇహపరలోకముల యందు లభించదు.

117. ఇవ్వడంలో ఉండే సుఖాన్ని ఈ మానవులు ఎప్పుడూ అనుభవించినట్టు లేదు. లేకుంటే, అవసరమున్నవారికి దానం చేయకుండా, చివరలో ఒక్కసారిగ త్యజించి వెళ్ళిపోతారే - వాటిని ఇవ్వడానికి ఎందుకని అంత కఠినంగా ఉంటారు?

118. నిప్పులో కాలి బంగారు నిగ్గు తీరుతుంది. సత్పురుషులు బాధానుభవంలో తమ శక్తిని ఇనుమడింప చేసుకుంటారు. తమకు తాము ఆనందంగా భరించే బాధల వలన దివ్యంగా ప్రకాశిస్తారు.

119. మనసా వాచా నీవు సత్యరూపుడవైనచో తపము చేయువారి కన్నను, దానము చేయువారి కన్నను నీవు ఉత్తముడవు. సత్యము కన్నను గొప్పదైన సుగుణము లేదు. సత్యములో అహింస చోటు చేసుకోవాలి. అప్పుడు అది పూర్ణ సత్యమవుతుంది.

120 క్రోధము బాధను కలిగిస్తుంది. అంతేకాదు, దుష్టభావాలకు జీవం పోస్తుంది. క్రోధము ఇతరులను బాధించక పోయినా తననైనా బాధపెట్టే తీరుతుంది. ఏవిధంగా చూచినా క్రోధము అనివార్యంగా బాధిస్తుంది.

121. క్రోధము వచ్చినవాడు నిగ్రహాన్ని కోల్పోయి తలను భూమికేసి బాదుకుంటాడు. అలాంటి కర్మ ద్వారా తాను బాధించేది తననే. ఇతరులను కాదు. క్రోధమును ప్రదర్శింపక పోవడం చేత పోయేదేమీ ఉండదు. పైగా, మనస్సులో కోపము ఉపశమించినవారు పొందవలసిన దానిని శీఘ్రముగా పొందుతారు.

122. నీకు అపకారము చేసినవారు అవమానంతో తలవంచేలా చేయాలంటే దానికి ఒకటే మార్గము. అపకారికి తిరిగి ఉపకారము చేయుటయే.

123. ఇతరుల బాధలు తన దేహంలో బాధలవలె భావించి వాటిని నివారించుటకు ప్రయత్నించని వ్యక్తి ఎంత చదువుకొని ఏమి ప్రయోజనం? తాను బాధను అనుభవించి, బాధ ఏమిటో తెలిసిన వ్యక్తి ఇతరులకు బాధను ఎలా కల్పించగలడు?

124. నీవు 'మంచి' అని భావించినదానిని ఆలస్యము చేయకుండా ఆచరించు. ఈ ప్రపంచంలో నిన్నటి మనిషి నేడు లేడు అనేది నీకు తెలియనిది కాదు. మరుక్షణము ఉంటామనే నమ్మకం మనకు లేదు. అయినా అసంఖ్యాకంగా మనలో ఊహలు, ఆశలు కదుల్తున్నాయి.

125. సంగత్వము వదలిన వారికే సద్యోముక్తి ప్రాప్తిస్తుంది. లేకపోతే, ఈ ప్రపంచమనే అశాశ్వత గృహంలోనే పునః పునః ప్రవేశించవలసి వస్తుంది.

126. అసత్య విలువలపై ఆధారపడుటయే మన సర్వదుఃఖాలకు కారణంగా తెలుస్తోంది. సత్యవిలువలపై ఆధారపడినవారు తప్పక సత్యదర్శనం చేయగలరు.

127. అంతు తెలియని జననమరణ చక్రభ్రమణమునకు బీజకారణము కోరికే. జననమరణ చక్రము నుండి విడుదల ప్రసాదించమని అభ్యర్థించుట కన్నను కోరదగిన మరొక కోరిక లేదు. కానీ అన్ని కోరికలను త్యజించినపుడే ఈ కోరికను కోరడం జరుగుతుంది.

128. ఎంత గొప్ప కార్యమైనను నీవు నీరసపడ నవసరం లేదు. నిరంతరం శ్రమించువారిని విజయలక్ష్మి వరిస్తుంది. అంతేకాదు. ఇతరులకు మేలు చేయగలిగినాము అనే ఆనందం కూడా వారికే మిగులుతుంది. ప్రయత్నశీలురను లక్ష్మీదేవి కరుణిస్తే, సోమరిపోతులను దరిద్రదేవత వరిస్తుంది.

129. నీకు విజ్ఞానం లేదని నిన్నెవ్వరూ తప్పు పట్టరు. కానీ, విజ్ఞానము ఉండి దానిని వినియోగించలేనపుడు అందరూ నిందిస్తారు. ఆశించింది పొందలేకపోయినా, ఫలితము నిరుపయోగం కాదు.

130. విద్యాభిలాషి ధనాభిలాషివలె అణకువను, భయాన్ని కలిగి ఉండాలి. ధనాన్ని కోరువాడు ధనికుని ముందు భయంతో ఎలా నిలబడుతాడో విద్యను అర్థించువాడు కూడా అలాగే ప్రవర్తించాలి. ఇలా ప్రవర్తించుటకు అంగీకరించని అహంకారి అజ్ఞానిగా మిగిలిపోతాడు. జీవితంలో అధోగతికి జారిపోతాడు.

131. అజ్ఞానుల చేతిలో ధనము, జ్ఞానులకు లభించిన దారిద్ర్యము వారికే కాకుండా లోకానికి కూడా శోకాన్ని కలిగిస్తుంది. కానీ వీరిరువురిలో అధిక దురదృష్టవంతులు మొదటివారే. వాస్తవానికి దారిద్ర్యము అనేది జ్ఞానులను పెద్దగా దుఃఖపెట్టదు. కాని, అజ్ఞానుల సంపద ప్రపంచానికి ప్రమాదంగా పరిణమిస్తుంది.

132. ప్రజలు బుద్ధిగల శ్రమజీవు లైననాడు దేశము అభివృద్ధి పథంలో కొనసాగుతుంది. ఎప్పుడూ సమాజసేవకు సిద్ధంగా ఉండే వ్యక్తికి లభించే గౌరవము మరెవ్వరికి లభించదు.

133. సమాజానికి సేవ చేయాలనే కుతూహలం కలవారు సమయాల్ని, హోదాల్ని ఆలోచిస్తూ శక్తిని వృధా చేసుకోరు. సేవాతత్పరత గల అట్టి వ్యక్తుల చుట్టూ సమాజము పరిభ్రమిస్తూ ఉంటుంది.

134. ఆలస్యము కొన్ని విషయాలలో దోషయుతము. వాయిదా వేసుకొనే మనస్తత్వం సముచితమైనది కాదు. ముళ్ళపొదను ప్రారంభములోనే తొలగించివేయాలి. దానికి పెరిగే అవకాశమిస్తే ఆ తరువాత తొలగించే ప్రయత్నం చేయునపుడు నీ చేతులే గాయపడతాయి.

135. వెలిగే దీపమును నీటిలోనికి ఎలా తీసికొని వెళ్ళలేమో, మత్తు పానీయముతో మైకము ఆవరించిన వాని మనసులోకి వివేకమును దింపలేము. వివేకమునకు స్పందించే శక్తిని మత్తు పానీయము హరిస్తుంది.

136. వివేకము లోపించి వివాదాస్పదంగా పరిణమించే స్నేహము కన్నా ప్రమాద భరితమైనది మరొకటుండదు. ఒకసారి ఏర్పడిన తరువాత అంతతేలికగా తొలగించుకొనుటకు స్నేహము సులభము కాకపోవుటయే దానికి కారణము.

137. ఆనందంగా నవ్వుతూ కలిసి తిరగడమే స్నేహము కాదు. ధర్మమార్గము నుండి మిత్రుడు మరలునపుడు కర్కశమైనదైనా సముచితమైన సలహాలను ఇవ్వగలిగేదే స్నేహము.

138. నీవు చెడుమార్గానికి తిరిగినపుడు నిన్ను శాసించగలిగేవారు, అవసరమైనపుడు నిన్ను హింసించకుండానే ఏడిపించి సన్మార్గానికి త్రిప్పగలిగేవారు అయిన స్నేహితులను అన్వేషించి పట్టుకో. వారితో స్నేహాన్ని కుదుర్చుకో.

139. త్యాగం చేయడానికి ఏమీ లేనివారు కూడా ప్రపంచాన్ని త్యజించలేరు. సన్యాసాన్ని ప్రేమించలేరు. కారణం, గతజన్మలలో వారు అట్టి జ్ఞానాన్ని సముపార్జించక పోవుటయే.

140. ఇతరులను ఉదయమున బాధిస్తే ఆ బాధ మధ్యాహ్నానికి బాధించిన వానికి వచ్చి తీరుతుంది. కార్యకారణ సిద్ధాంతము అందించే అనివార్య ఫలము పాపిని వదిలిపెట్టదు.

141. సామాజిక సహకారము నిన్ను నశింప చేసేటట్లు కనిపిస్తే అలా నశించిపోవడమే సముచితము. నీ చుట్టూ ఉండేవారికి సేవచేసే అవకాశమును అందించగలిగితే నిన్ను నీవు బానిసగా అమ్ముకున్నా తప్పులేదు.

142. ఔదార్యమును ప్రదర్శించుటలో విఫలమయ్యే లుబ్ధులు ఎంత బుద్ధిహీనులు? సంపదల మధ్య పేదరికాన్ని అనుభవించేవారు వారే. ఔదార్య మనేది ఒక క్రతువు లాంటిదని అందరూ గ్రహించలేరు.

143. బ్రహ్మచారులు, సన్యాసులు ప్రపంచాన్ని త్యజించి జీవిస్తున్నారంటే కొందరు గృహస్థులుగా జీవించాలని నిర్ణయ మవుతోంది. కనుక గృహస్థులు కేవలం భోగాల కొరకే ఉన్నారని వారిని చిన్నచూపు చూడకూడదు. కర్మను త్యజించిన వారి కొరకే గృహస్థులు కర్మాచరణములో ఉన్నారు.

144. తాను వసించే సమాజములో గొప్ప పరిణామాన్ని తీసుకొని రావాలని ఆశించు వ్యక్తి గొప్ప కష్టాలను అనుభవించేందుకు సిద్ధపడాలి. ఇతరుల కొరకు బాధలను, దుఃఖాలను అనుభవించే రీతిలో తన దేహాన్ని, మనసును తయారు చేసుకోవాలి.

145. సంఘసంస్కరణము అనేది సమర్పణ భావం గల అనేకమంది వ్యక్తుల సామూహిక బాధానుభవం లోనే ప్రాప్తిస్తుంది. త్యాగమయ శక్తులు గల వ్యక్తులు ఉద్ధరించేందుకు లేకపోవుట చేతనే దురదృష్టముచే ఆవరించబడి సమాజ వృక్షము తలక్రిందులౌతుంది.

146. నీవు దురదృష్టములో కొనసాగే సమయాన స్నేహితులను గాని, శత్రువులను గాని తయారు చేసుకోవద్దు. నీకు వారిపై విశ్వాసమున్నా, లేకపోయినా నీవు చేయగలిగింది, చేయవలసింది తటస్థముగా ఉండుటయే.

147. వారికి ముందే తెలియనిచో, నీ బలహీనతలను నీ శత్రువులకు, ఊరడింపును పొందే ప్రయత్నములో నీ కష్టాలను స్నేహితులకు తెలియనీయకు.

148. శత్రువు యొక్క బలాన్ని అణచివేయుటలో సకాలచర్య గైకొనుటయందు విఫలురయ్యేవారు వినాశమునే అనుభవిస్తారు. హాస్యానికైనా ఎవరినీ శత్రువుగా తయారు చేసికొనుటకు ప్రయత్నించవద్దు.

149. ఒక ఏనుగును పట్టుటకు మరియొక ఏనుగును వినియోగించునట్లు, ఒక విషయమునందు సాధించిన అనుభవమును మరియొక విషయమును సాధించుటకు ఉపయోగపెట్టుకోవాలి.

150. సక్రమమైన మార్గంలో, అక్రమ ప్రవర్తన లేకుండా ఆర్జింపబడిన ధనము ఈ జీవితములో సుఖమును అందించుటయే గాక ధర్మమార్గమున చరించునట్లు చేస్తుంది.

151. నైతికధర్మాలకు విరుద్ధమైన కర్మలను విస్మరించాలి. ఉన్నతులు కావాలని అభిలషించువారు వారి మంచిపేరును చెడిపే ప్రతి విషయము నుండి విడిపోవాలి.

152. నైతిక నియమాలను ఉల్లంఘించి సాధించిన ప్రగతి ఏదైనను చివరగ శోకమునే ముందుంచుతుంది. ఆకలితో అలమటించే కన్నతల్లికి అన్నం పెట్టే కార్యమును చేపట్టే విషయంలో కూడా, మహాత్ములు నిరసించే కార్యాలను చేపట్టకూడదు.

153. సంక్షిప్తంగా, సక్రమంగా మాట్లాడడం చేతకానివారే అధికప్రసంగం చేస్తూ ఉంటారు. ప్రసన్నంగా మాట్లాడాలి. ఎదుటివారిలో గోచరించే సద్భావాలను స్వీకరించగలగాలి.

154. ఇతరులు ఏవిధమైన వాదనచే కూడా తప్పు పట్టలేరు అని నిర్ణయించుకొనిన తరువాతే తన వాదమును వినిపించాలి. అంగీకరించినవారు త్వరగా ఆకర్షితులై, అంగీకరించని వారు కూడా ప్రసన్నంగా వినగలిగినపుడే అది సుభాషితము అవుతుంది.

155. వర్షాన్ని కురవని ఆకాశము భూమిని ఎండగట్టునట్లు, కరుణను వర్షించని రాజు ప్రజలను నాశనం చేస్తాడు. ధర్మమును పాటించని ప్రభువు పాలనలో దారిద్ర్యము కన్నా సంపదే ఎక్కువగా కష్టపెడుతుంది.

156. ఘోరమైన అపరాధాలకు మరణశిక్ష విధించడమనేది మొక్కలు ఏపుగా పెరుగుటకు క్షేత్రములో కలుపుతీయుట లాంటిది. చక్కని పరిపాలనను అందించలేని ప్రభువు హంతకుని కన్నా ప్రమాదకరమైనవాడు.

157. పెరిగే మొక్కలు మన్ను యొక్క స్వభావమును విశదపరచినట్లు, ప్రసన్న భాషణము కుటుంబ స్వరూపమును వ్యక్తం చేస్తుంది. సదాచారమునకు అలవాటు పడిన పురాతన కుటుంబాలు పేదరికంలో ఉన్నను ఆచారమునందు పతనం కావు.

158. మనిషి ఎంత శక్తివంతుడైనను, ఒక పథకమంటూ లేకుండా ఆచరించే కర్మ వలన లభించే ఫలాలు ఎన్నడైనా శూన్యంగానే మిగుల్తాయి. ఒక కర్మను నిర్ణయించుకొనే ముందు బాగా ఆలోచించాలి. ఒకసారి నిర్ణయించిన తరువాత సందేహించడం దోషయుతము.

159. శత్రువుల శక్తిసామర్థ్యముల విషయంలో జ్ఞానంతో ప్రవర్తించనివాడు, తన శక్తిని సక్రమముగ మదింపు వేసుకొనే శక్తి లేనివాడు, తనను అధికంగా ఊహించుకొనేవాడు తన అంతమును శీఘ్రంగా చేరుకుంటాడు.

160. శత్రువులు కల్పించే దుఃఖాలకన్నను అజ్ఞానంతో తమకుతాముగా కల్పించుకొనే దుఃఖాలే తీవ్రంగాను, ఎక్కువగాను ఉంటాయి. తమ జ్ఞానానికి సంబంధించి గర్వించడం కన్నను అధికమైన పొరపాటు మరొకటుండదు.

161. తెలియని విషయాన్ని తెలిసినట్లు ప్రదర్శించడం వల్ల తనకు తెలిసిన విషయంలో లభించిన ఔన్నత్యాన్ని కూడా మనిషి పోగొట్టుకుంటాడు. సాధారణమైన ఈ దోషము ప్రజ్ఞావంతులలో కూడా కనిపిస్తుంది.

162. దేహాన్ని గుడ్డతో కప్పుకున్నంత మాత్రాన అశ్లీల స్వభావులు మానరక్షణ గలవారు కాలేరు. శీలశూన్యులు వస్త్రశూన్యులకన్నా మానహీనులు.

163. పరిశుభ్రమైన పడక మీదికి అశుద్ధమైన పాదాలతో ప్రవేశించడం ఎలాంటిదో పండితుల సన్నిధికి బుద్ధిహీనుని ప్రవేశం అలాంటిది.

164. శత్రువు ప్రదర్శించే నమ్రతను, మాటలలో చూపే మర్యాదను చూచి మోసపోవద్దు. అతడు వంగి వంగి ఎలా నమ్రతను ప్రదర్శిస్తాడో అలాగే ధనుస్సును కూడా వంచి బాణాన్ని ఎక్కుపెడతాడు.

165. కష్టాలు వచ్చినపుడు విడిచిపెట్టి పారిపోయే స్నేహితులను కలిగియుండుట కన్నా మిత్రులు లేని జీవనమే మేలు. యుద్ధరంగంలో పోరాడటానికి సమరమెరుగని అశ్వముపై స్వారి చేస్తూ వెళ్ళడం కన్నా నడచివెళ్ళి యుద్ధం చేయడం మంచిది.

166. విద్యాగంధము లేనివాడు ఎంత గొప్ప స్థానములో ఉండినా అంధునితో సమానము. విద్యావంతుడే చక్షుష్మంతుడు. విద్యాహీనునికి ముఖంలో రెండు రంధ్రాలుంటాయి. వాటిని నేత్రాలు అని పిలువకూడదు.

167. అదృష్టము వరించినపుడు పొంగిపోకుండా నిగ్రహంగా ఉండగలిగిన వారు దురదృష్టము ఆవరించినపుడు దుఃఖానికి దూరంగా ఉండగలరు. దురదృష్టము దేహాన్నే ఊపుతుంది. మనసు దీనికి అతీతంగా పయనించ గలదు.

168. మానవ జీవితము ఏ క్షణాన్నైనా దురదృష్టము అనే వలలో చిక్కుకోవచ్చు. బుద్ధిమంతులకు ఈ సత్యము తెలుసు. కనుక అలాంటి సందర్భాలు ఎదురైనపుడు వారు చలించరు.

169. బాధల్లో పెద్ద బాధ అయిన కోరికను దూరంగా ఉంచగలిగితే, మనిషి ఈ జీవితంలోనే అఖండమైన సుఖమును అనుభవించవచ్చు. కోరిక కన్నా మోసగాడు మరొకడుండడు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ జాగరూకులై ఉండాలి.

170. కొందరు గురువింద గింజవలె అందంగా కనిపిస్తారు. కానీ గురువింద గింజలో నల్లని మచ్చ ఉన్నట్లే హృదయంలో మచ్చ కలిగి ఉంటారు. బాహ్య సౌందర్యము కన్నా ఆంతరంగిక సౌందర్యమే ప్రశస్తమైనది.

171. ప్రపంచం నిరసించేవాటిని విస్మరించ గలిగితే తలలు బోడులు కానవసరం లేదు. గడ్డాలు పెంచవలసిన పనీ లేదు. సాధువైన వానికి ముఖ్యమైనది పవిత్రతయే గాని ప్రదర్శనలు కావు.

172. ప్రతి జీవి ఈ ప్రపంచంలో ఇల్లు లేని సంచారియే. ఇల్లు లేనివాడు చెట్టు నీడన కొంతకాలము విశ్రమించేది దానిని వదలిపెట్టి వెళ్ళేందుకే అయినట్లు, జీవి దేహాన్ని ఆశ్రయించుకొని జీవించేది ఒకనాడు దానిని త్యజించుటకే.

173. కామము నుండి విముక్తి పొందుట చేతనే పవిత్రత సిద్ధిస్తుంది. సత్యదర్శనము కొరకు చిత్తశుద్ధితో ప్రయత్నము చేయువారే కామము నుండి విముక్తిని పొందగలరు.

174. గోచరించే విషయ ప్రపంచములో అన్నిటి వెనుక భాసించే సత్యమును దర్శింప చేయునదియే సరియైన వివేకము. జ్ఞాని యైనవాడు భిన్నమైన దృశ్యముల వెనుక ప్రకాశించే సత్యమును దర్శిస్తాడు.

175. సంశయ శృంఖలాల నుండి విడిపడిన వివేకవంతులకు తాము నివసించే భూతలము కన్నను స్వర్గము చాలా దగ్గరగా ఉంటుంది. సత్యమును దర్శించే పుణ్యాత్ముల మార్గము జన్మరాహిత్యము వైపునకు సాగిపోతుంది.

176. నీకు ఒకే ఒక సంగత్వము వాంఛనీయము. అది భగవత్సంగత్వము. ఈ ఒక్క సంగత్వము వలన సమస్తమైన సంగత్వాలు అదృశ్యమవుతాయి.

177. త్యజించిన వాటి చుట్టూ మనసు పరిభ్రమించడం సన్యాసము యొక్క లక్షణం కాదు. కాని, త్యజించడము అనే దానితోనే ప్రారంభించాలి. లేనిచో మనకు మరొక మార్గము గోచరించదు.

178. జన్మ పరంపరలను అంతమొందించాలి అనేదే వ్యక్తి అభిమత మైనపుడు, ఏవిధమైన సంగత్వములను కొనసాగించుటలో కూడా ఔచిత్యం గోచరించదు. చివరికి దేహము కూడా వదలించుకోవలసి నంతగా భారమై మిగుల్తుంది.

179. ప్రాపంచిక విషయాలను గట్టిగ పట్టుకొను వారిని సకల విధములైన బాధలు మరీ ఉడుము పట్టులా పట్టుకుంటాయి; చుట్టుకుంటాయి. ఎవరైతే సంపూర్ణముగ త్యజించ గలిగారో, అలా త్యజించామనే ఆలోచనను కూడా పరిత్యజించగలిగారో వారే తమను తాము రక్షించుకుంటారు.

మిగిలిన వారందరు ఇంకా వలలోనే చిక్కియున్నారని, భ్రాంతిలోనే పరిభ్రమిస్తున్నారని అర్థము.

180. సంగత్వము అనేది దుఃఖహేతువుగా తెలుస్తూ ఉంది కనుక ప్రతి త్యాగము సుఖజీవనానికి సోపానమే అవుతుంది. అన్నిటినీ ఒకేసారి త్యాగం చేయవలసిన అవసరం లేదు. ఒకొక్కదానిని పరిత్యజించుట వలన కార్యము సిద్ధించక పోదు. ఒకొక్కదానిని త్యజిస్తే, అంతవరకు దుఃఖం దూరమవుతుంది.

181. పవిత్రాత్ములు వాంఛించే కాంతిని దీపాలు ఇవ్వలేవు. సత్యదీపము ఒక్కటే వారి మార్గమును ప్రకాశవంతం చేస్తుంది.

182. చెడు అనేది ఎక్కువగా కోపము వల్లనే కలుగుతుంది. ఇతరులు మనల్ని రెచ్చగొట్టినపుడు దాని వెనుక ఉండే కారణాన్ని మనం మరచిపోవాలి.

183. నీకు జరిగిన అపరాధము చాలా పెద్దదే కావచ్చు. అనేక శిఖలతో ప్రజ్వరిల్లే అగ్నిలా అది దహింపచేసి ఉండవచ్చు. అయినా సాధించ గలిగితే, పగ్గాలు వేసి క్రోధమును నిగ్రహించడం చాలా ఉత్తమము.

184. చెడు చేసిన వారికి తిరిగి మంచి చేయడము అనే కార్యమును సూచించే సూక్తి ఆచరణ యోగ్యము కాదు అనిపిస్తుంది. కానీ, ప్రయోగము చేసి చూసిన వారికి అది ఎంత ప్రభావం కలిగిన సలహాయో అర్థమవుతుంది. అలా చేయుట ద్వారా చెడు చేసిన వాని మనసు తీవ్రంగా మధన పడుతుంది. ఈవిధమైన కార్యమును ఏ కోపప్రదర్శనము సాధించలేదు.

185. అనివార్యమైన కర్మసిద్ధాంతము ప్రకారము మనవి కానివాటిని ఎంత ప్రయత్నించినా నిలుపుకోలేము. అలాగే మనకు సంబంధించిన వాటిని అజాగ్రత్తతో విస్మరించినా అవి మనల్ని వదలిపెట్టవు.

186. కొందరు సంపదలతో రాణిస్తారు. మరికొందరు జ్ఞానంతో శోభిస్తారు. సంపన్నులు జ్ఞానవంతులుగా ఉండాలనే నియమం లేదు. జ్ఞానవంతులు సంపన్నులు కాకపోవచ్చు. గత జన్మలలో ఆచరించిన కర్మల యొక్క ఫలాలే జీవనరీతుల్ని నిర్ణయిస్తాయి.

187. పిరికివాళ్ళను కోటగోడలు కాపాడలేవు. అశ్రద్ధ గలవారిని ధనము సుఖపెట్టలేదు. నీకు సంపద లభించినపుడు, గతంలో జాగ్రత్త లోపించడం వల్ల పాడైన వారిని మనసుకు తెచ్చుకొని జాగరూకుడవై వర్తించు.

188. ఏ ఆశయము సిద్ధించాలన్నా దానిని సదా మనసులో ఏమరపాటు లేక దర్శిస్తూ ఉండాలి. లక్ష్యమునందు దృష్టి కలిగి యుండడము ధ్యేయం కావాలి.

189. మనిషి నశించే సమయం ఆసన్నం కాబోయే ముందు సోమరితనము, విస్మృతి, నిద్ర అనేవి నావల్లాగా సమీపిస్తాయి. వినాశము వైపునకు మోసుకొని పోతాయి.

190. నీకు సంబంధించిన విషయములో అకర్మణ్యత చోటు చేసుకోకుండా జాగ్రత్త పడాలి. కార్యసిద్ధికే మనిషి జన్మించాడు. దానిలో విఫలమైనవాడు ప్రపంచంలో దేనికీ పనికిరాడు.

191. చక్కని ప్రయత్నము చేయడము కూడా సత్ఫలితమే. ప్రతి ప్రయత్నము మనిషిని తెలియకుండా ప్రగతి పథంలోకి నడిపిస్తుంది. ఆ ప్రయత్నంలో వెచ్చించే శక్తి వ్యక్తి యొక్క శీలమును శక్తివంతం చేస్తుంది.

192. విద్యార్జన రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి గణితము. మరొకటి సాహిత్యము. అంకెలకు సంబంధించింది ఒకటైతే అక్షరాలకు సంబంధించింది మరొకటి. మానవజీవితానికి ఈ రెండూ నేత్రద్వయము వంటివి.

193. నదీతీరములోని ఇసుక దిబ్బలవద్ద త్రవ్వే కొద్దీ నీరు ఊరుతూ ఉంటుంది. అలాగే, పరిశ్రమించే కొద్దీ జ్ఞానము అభివృద్ధి చెందుతూ ఉంటుంది.

194. సమ్యక్ జ్ఞానము కలవాడు ప్రపంచము ఎలా చలిస్తున్నదో తెలిసి చరిస్తాడు. జ్ఞానము వలన అతనికి సమస్త ప్రపంచముతో మిత్రత్వము ఏర్పడుతుంది. ఉద్రేకాల నుండి, అశక్తత నుండి మనిషిని జ్ఞానం ఉద్ధరిస్తుంది.

195. జ్ఞానవంతుడు రాబోయే ఆపదను ముందుగానే ఊహిస్తాడు. కనుక శోకం నుండి తప్పించుకుంటాడు. భయపడవలసిన విషయములో అతడు భీతి కలిగి ఉంటాడు. భయ విషయాలలో నిర్భయంగా చరించడము కూడా మూర్ఖత్వమే అవుతుంది.

196. మనిషికి ఎన్ని ఉండినా వివేకము గల మనసు లేనపుడు అవన్నియు వృధాగా మిగిలిపోతాయి. కనుక వివేక బుద్ధియే అన్నిటికన్నను ఉత్తమమైనది.

197. జీవితమును వివేకవంతముగ నడుపుకున్నపుడే వివేక మనే పదానికి విలువ సిద్ధిస్తుంది. విద్యార్జన మాత్రమే జ్ఞానము అనిపించుకోదు. వివేకము కలిగి జీవితమును సన్మార్గములో నడుపగలిగిన వాడే జ్ఞానవంతు డనిపించుకొంటాడు.

198. గాఢంగా అధ్యయనము చేయువారు గ్రంథములో అధిక సౌందర్యమును దర్శించుటయే గాక అధికమైన ఆనందమును కూడా పొందుతారు. అలాగే సజ్జనుని స్నేహము సౌందర్యము కోల్పోకుండా ఉండుటయే గాక నిత్యము సుఖమును వృద్ధి చేస్తూ ఉంటుంది.

199. అందరూ జన్మలో సమానులే. భేదాలనేవి కొందరిలో అధిక కర్మల ఫలంగా, మరికొందరిలో నైష్కర్మ్యం యొక్క ఫలితంగా ఏర్పడుతాయి.

200. ఉన్నతులైనవారు అన్యుల లోపాలను, దోషాలను పట్టించుకోరు. స్వల్ప మనస్కులు ఇతరుల దోషాలను ఏకరువు పెట్టుటలో తీరిక లేకుండా ఉంటారు.

201. ఆత్మసంపదలోనే నిజమైన వైభవము దాగి ఉంది. అట్టి సంపద లేనివారు కూడా దానిని వాంఛించి పొందుటకు యత్నించుట చేత వారు కూడా ఆత్మజ్ఞానంతో తులతూగుతారు. కన్య తన కన్యత్వమును కాపాడుకొనునట్లు మహాత్ములు తమ వైభవమును రక్షించుకోవాలి.

202. బంధువులు, ఆత్మీయులు నిన్ను త్యజించి వెళ్ళారని ఆవేదన చెందకు. వాళ్ళు అలా వెళ్ళడానికి కారణమేమిటో గ్రహించి, ఆ దోషమును తొలగించుకోగానే వారు మళ్ళీ తిరిగి వస్తారు. అంతేగాని త్యజించి వెళ్ళారని వారిని తూలనాడకు.

203. తల్లిగా, భార్యగా రాణించే లక్షణాలు గల యువతి అవివాహితగా కొనసాగి మరణించడం ఎలాంటిదో ఆర్తులకు ఉపయోగపడక నిలువ వుంచబడిన ధనము అలా వృథా అవుతుంది.

204. ధర్మజ్ఞులు ధర్మం కొరకు ప్రాణాన్నైనా త్యజించాలి. కానీ ప్రాణాన్ని రక్షించుకొనేందుకు ధర్మాన్ని తాకట్టు పెట్టకూడదు.

205. శిక్షల భయంతోనే బుద్ధిహీనులు క్రమం తప్పకుండా ఉంటారు. భయము యొక్క ఒత్తిడి వల్లనే వారు నిగ్రహవంతులై ఉంటారు. ఈ

ప్రపంచంలో బుద్ధిహీనుల యొక్క అవసర మేమిటి? సమయము, సందర్భము తోడైతే వారిని వారు అమ్ముకొనేందుకు కూడా వెనుకాడరు.

206. "నిన్న ఎలాగో జీవించాను. ఇంకొక రోజు అరుదెంచినదా! దానిని కూడా నేను అధిగమించాలా!" ఈ విధమైన ఆలోచనలే ప్రతి సూర్యోదయంలో దురదృష్టవంతుని మనస్సులో కదుల్తాయి. జీవన పోరాటమే జీవిత పరమావధిగా గోచరిస్తుంది.

207. అర్హత కలిగి ఆశించి వచ్చిన వానికి అవకాశము ఉండికూడా "లేదు" అని పలికే మాట వినేవానికి విషపూరితంగాను మరణ సదృశంగాను ఉంటుంది. కాని విచిత్రమేమిటంటే ఆ విషమే పలికే వాడి దేహంలో భాగమై ఉండినా, అతని నోటిగుండా బయల్వెడలినా అతనికి ఏ హాని జరుగుట లేదు. (అవును. విషం పాలను పాడుచేయగలదేమో గాని విషం విషాన్ని ఏమి చేయగలుగుతుంది?).

208. సంపదను తయారు చేయడం, వనరులను కాపాడుకోవడము, రాజ్యమును రక్షించడం, సక్రమముగా వ్యయం చేయడం ప్రభువు నిర్వహించవలసిన బాధ్యతలు. మంచి ప్రభుత్వములో ఈ నాలుగు లక్షణాలు కనిపిస్తాయి.

209. సంపదలలో నమ్రత గలిగి ఉండాలి. పరిస్థితులు విషమించి, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనపుడు నీ తలను పైకెత్తి నడువవచ్చు. దర్పమును ప్రదర్శించవచ్చు. ఇవి చూచి నీ పేదరికమును ప్రజలు గుర్తించరు. నిన్ను చులకన చేయరు.

210. ఇంతకు పూర్వము తీసుకొనిన ఆహారము బాగా జీర్ణమైనది అని నిర్ణయమై, బాగా ఆకలి అవుతున్నది అని తెలిసినపుడు, తన ఆరోగ్యానికి సరిపడే ఆహారమును భుజించాలి. దీర్ఘకాల జీవనానికి మితాహారమే హితాహారము.

211. చక్కని చికిత్సలో నాలుగు విషయాలు ప్రధానంగా ఉంటాయి. అవి; 1. రోగి 2. వైద్యుడు 3. చికిత్స 4. అనుచరుడు. వైద్యుడు, మందుల కన్నను సహకరించే రోగి, నేర్పుగా సేవల నందించే సేవకుడు ఏ మాత్రము స్వల్ప ప్రాధాన్యత గలవారు కారు.

212. శత్రువులు ముట్టడించి జయించలేని ఆంతరంగిక కోటయే జ్ఞానము. ఈ ప్రపంచములో ఎవరినీ బాధించకుండా భాషించే శక్తి సత్యదర్శనము వలననే ప్రాప్తిస్తుంది.

213. ఖడ్గమును మోయలేని వానివద్ద ఖడ్గము ఉండి ఏమి ప్రయోజనం? కుశాగ్రబుద్ధి గల విద్వాంసుల సన్నిధిలో భీతి చెందే వానికి విద్య ఉండి ఏమి లాభము?

214. అబద్ధాలతో, మోసాలతో ప్రగతిని సాధించడమనేది కాలని మట్టి కుండలో జలమును నిలువ చేయడమే అవుతుంది.

215. "నీవు ఈ కార్యము నాచరించుట వలన దుఃఖపడవలసి వస్తుంది" అని నీ అంతర్యం తెలిపితే, ఆ కార్యాన్ని వెంటనే విస్మరించు. ఒకవేళ చేసి ఉంటే, ఇక మీదట చేయకుండా ఉండేందుకు ప్రయత్నించు.

216. కార్యసాధకుడు రెండు విషయాలను జ్ఞాపకం పెట్టుకొని జీవించాలి.

1. 'విజయాన్ని సాధించలేము' అనుకున్న కార్యాన్ని చేపట్టకూడదు.

2. చేపట్టిన కార్యము మధ్యలో వక్రించినచో చెదరకుండా ధైర్యంతో కష్టాల నెదుర్కోవాలి.

217. హృదయపూర్వకంగా ఇతరుల కొరకు నీవు ఆచరించే సేవలకు లభించే ఫలితాలను చూచి నమ్మడానికి నీవే సంశయిస్తావు.

218. భూమిని తన్నేవాడు వాస్తవానికి భూమిచేత తన్నబడే వాడే. కోపము హింసించేది కోపిష్టినేగాని ఇతరులను కాదు. నిగ్రహింపబడని క్రోధము బ్రతుకునే నాశనం చేస్తుంది.

219. తనపై తాను విజయాన్ని సాధించిన వ్యక్తి లోకపూజితు డవుతాడు. తనపై తనకే అనుమానమున్న వ్యక్తి యొక్క పవిత్రత ఎన్నడూ గౌరవమునకు నోచుకోదు.

220. నీ మనసే నీకు శత్రువని మరచిపోకు. ఈర్ష్య అనేది భాగ్యవంతుణ్ణి కూడా దరిద్రునిగా మార్చేస్తుంది. నీ ధనాన్ని అపహరించడానికి దొంగలు అవసరం లేదు. ఆ పని ఈర్ష్యే చేసిపెడుతుంది. డబ్బు ఉండినా నిన్ను దీనునిగా తీర్చిదిద్దుతుంది.

A C.No 9962

స్వర్ణోత్సవ కెరటాలు - 11

ఈ ప్రపంచంలో ఎవరైనా చూసారా. ఈ జగతి ఎవరికైనా అందమౌనే.

జగతికి చీకట్లు జీవికి ఇక్కట్లు నిత్యం కావు జీవితాకాశంలో అంధకారం ఎప్పుడు అలుముకుంటుందో ఎవరికి అర్థంగాని దారుణ పరిస్థితులలో మనకంటూ ఒక వెలిగే దీపం ఉండాలి. మనదంటూ ఒక వెలిగే కాంతి తోడు కావాలి.

ఆ జ్యోతి ఆరేది కాకూడదు. మారేది కాకూడదు. మారని, ఆరని జ్యోతి అక్షర జ్యోతి.

మహర్షులనుగ్రహించిన అక్షరప్రసాదమును విశేషంగా వితరణ చేసింది సుందరచైతన్యస్రవంతి.

ఐదు పదులలో స్వరుజే అడుగిడుతున్న ఈ సంవత్సరాన్ని "చైతన్య స్వర్ణోత్సవ సంవత్సరం" గా భక్తులు ప్రకటించారు.

విలువైన వేదాంత గ్రంథాలను విరివిగా అందించిన సుందర చైతన్యస్రవంతి చిన్నవి, పెద్దవి కలిపి యాభై నూతన గ్రంథాలను ఈ సంవత్సరం విడుదల చేసే కార్యానికి శ్రీకారం చుట్టింది.

ఇవి స్వర్ణోత్సవ కెరటాలు

సాధువాక్యం

"నేనెలా ఉండాలి?" చెప్పవలసింది సంకుచిత మనస్సు కాదు. పరిపూర్ణ సాధుహృదయం. వ్యవస్థ గుండె చప్పుడు గ్రహించిన అట్టి తపస్వి తిరు వళ్ళువర్ బోధలకు శ్రీ స్వామీజీ అనువాదం ఈ 'సాధువాక్యం'.